క్లుప్తంగా

బాధితులకు సెల్‌ఫోన్ల అపగింత



జనగామ రూరల్: వివిధ ప్రదేశాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేయగా బుధవారం డీసీపీ రాజమహేంద్రనాయక్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మొబైల్ పోయిన వెంటనే అన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరూ సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయవద్దన్నారు.

టెన్త్ టాపర్లకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

పాలకుర్తి: టెన్త్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించిన వావిలాల గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి హాజరై విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతోపాటు బహుమతులను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు మహాత్మాగాంధీ హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు గంట రవీందర్ అందించే ప్రోత్సాహం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉపాధ్యాయులు వరప్రసాద్, కొండయ్య, నీలకంఠం, తల్లి దండ్రులు, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ షీలా లింగయ్య, కూనబోయిన కుమారస్వామి, యాకూబ్‌రెడ్డి, దోపతిరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



ఆరాధనోత్సవంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని సంతోషిమాత, ఆంజనేయస్వామి దేవస్థానంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పారునంది శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక అభిషేకం, అలంకరణ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే పెంబర్తి మామ్మాయమ్మ దేవాలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న అండాలు

కొడకండ్ల: రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు వేసవిలో దాహార్తిని తీర్చేందు కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఈరంటి సాయికృష్ణ, డైరెక్టర్‌లు దేశగాని నాగరాజు, క్రాంతికుమార్, బత్తుల వెంకన్న, నామాల ఈదయ్య, ముత్యాల పూర్ణచందర్, వనం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘యంగ్ ఇండియా’ వేసవి శిబిరాలు

నేటినుంచి ఈనెల 25వ తేదీ వరకు శిక్షణ

- జిల్లాలో 81 పాఠశాలల ఎంపిక
- విద్యార్థుల అంతర్గత సామర్థ్యాల పెంపునకు కృషి
- ఒక్కో సెంటర్ నిర్వహణకు రూ.50 వేల నిధులు
- ఇప్పటికే కేజీబీవీల్లో శిక్షణ షురూ



కేజీబీవీలో వేసవి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థినులు

జనగామ రూరల్: ఈ వేసవిలో విద్యార్థుల సృజనాత్మకత నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ శిబిరాలు ఈ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిర్వహించేందుకు సిద్ధమైంది. జిల్లాలోని 72 ఉన్నత, 9 ప్రాథమికోన్నత (మొత్తం 81) పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో స్నాక్స్ ఇవ్వనున్నారు. కాగా ఇప్పటికే కేజీబీవీల్లో బాలికలకు శిక్షణను కూడా ప్రారంభించారు.

వేసవి శిబిరాల ప్రధాన లక్ష్యాలు..

విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల పెంపుదల, సొంతంగా ఆలోచించడం, అంతర్గత నైపుణ్యాలను వెలికి తీయడం, స్వేచ్ఛ అభ్యసన ప్రక్రియల్లో పాల్గొనడం, ఆరోగ్యకర జీవనం సాగించడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ప్రకృతిని ఆస్వాదించడం, ఉత్పాదకతపై అవగాహన పెంచడం తదితర అంశాలు ఉన్నాయి.

15 రోజుల పాటు శిక్షణ

6 నుంచి 17 సంవత్సరాల లోపు లోపు ఉన్న బాలబాలికలకు ఈ నెల 8 నుంచి 25వ తేదీ వరకు (15 రోజులు) ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ అందించనున్నారు. ఎంపిక చేసిన పాఠశాల ఆవాస ప్రాంతంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ శిబిరాల్లో చేరి శిక్షణ పొందవచ్చు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయుడు ప్రతీ రోజు ఈ శిబిరాలను పర్యవేక్షించాలి.

ఏమేం నేర్పిస్తారంటే..

పిల్లల ఆసక్తికి అనుగుణంగా కుట్లు, అల్లికలు, ఇండోర్ గేమ్స్, బొమ్మల తయారీ, చిత్రలేఖనం, నృత్యం, సంగీతం, మిమిక్రీ, మైమ్, యాంకరింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, వేదిక్ గణితం, కంప్యూటర్ పరిజ్ఞానం, కథలు చెప్పడం, రాయడం, చేతిరాత అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, సైన్స్ ఎగ్జిబిట్స్ తయారు చేయడం, సామాజిక సేవ, తెలంగాణ సాంప్రదాయ కళలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామాల్లో స్థానికంగా ఉన్న వనరుల దృష్ట్యా ఆయా అంశాలను ఎంపిక చేస్తారు. రానున్న రోజుల్లో శిక్షణ పొందిన అంశాల్లో నైపుణ్యాన్ని బట్టి స్వయం ఉపాధికి ఉపయోగపడనున్నాయని అధికారులు తెలుపుతున్నారు.

నిధుల కేటాయింపు ఇలా..

జిల్లాలో వేసవి శిబిరాలకు ఎంపిక చేయబడిన 81 పాఠశాలల్లో 62 పాఠశాలలకు 50 మంది చొప్పున రూ. 25 వేలు, 19 పాఠశాలలకు 100 మంది చొప్పున రూ. 50 వేలు వివిధ ఖర్చులకు విడుదల చేయనున్నారు.

శిక్షకుల నియామకం

ప్రతీ 25 మంది విద్యార్థులకు ఒక ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించి వారికి 15 రోజులకు రూ.3వేల గౌరవ వేతనం, ప్రతీరోజు విద్యార్థులకు అల్పాహారం కింద రూ.15 రూపాయల విలువైన స్నాక్స్, అభ్యసన సామగ్రి కొనుగోలుకు ప్రతీఒక్కరికి రూ. 100, వంట సహాయకురాలికి రూ.1,000, స్కావెంజర్‌కు రూ.1,000, పాఠశాలలో ఇతర అవసరాలకు రూ.2,500 ఖర్చు చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాలకు ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేసింది. విద్యార్థుల హాజరును హెచ్‌ఎంలు నిత్యం ఉదయం 8.30లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. రోజువారీ కృత్యాలను వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేయాలి. గ్రామాల్లోని బాలబాలికలు అధిక సంఖ్యలో హాజరై శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

-డి. భోజన్న, డీఈఓ

ఏర్పాట్లు పూర్తి చేశాం..



కలెక్టర్ సూచనల మేరకు నేటి (గురువారం) నుంచి జిల్లాలో యంగ్ ఇండియా వేసవి శిబిరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు కోరుకున్న అంశాల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణను విజయవంతం చేయాలి.

-బొమ్మనబోయిన శ్రీనివాస్, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి

సైన్యం పిలిస్తే వెళ్లేందుకు సిద్ధం

- రాష్ట్ర విశ్రాంత ఆర్మీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

జనగామ రూరల్: ఉగ్ర స్థావారాలపై మట్టుబెట్టే సమయంలో భారత సైన్యానికి తమ అవసరమని భావించి పిలుపు వచ్చిన వెంటనే సేవలను అందించేందుకు వెళ్తామని రాష్ట్ర విశ్రాంత ఆర్మీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు, డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం పాశవిక చర్యకు ప్రతీకారంగా దేశ సైనికులు తొమ్మిది ఉగ్రస్థావరాలపై మెరుపు దాడి చేసి మట్టు బెట్టారన్నారు. వీరులకు విజయకేతనం ఎగుర వేస్తూ ప్రతి భారతీయుడు అండగా నిలువాలని పిలుపునిచ్చారు. ఉగ్ర మూకలు పర్యాటకులను అమానుషంగా చంపడం, మహిళల సిందూరాన్ని దూరం చేయడంతో యావత్తు దేశం ఒక్కటైందన్నారు. ఉగ్రదాడి జరిగిన రెండు వారాల్లోనే ఆపరేషన్ సిందూర్ పేరుతో సైన్యం సత్తాచాటిందన్నారు. సైన్యానికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జైన రమేష్, విశ్రాంత సైనికుల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కోశాధికారి యూసుఫ్, విశ్రాంత సైనికులు కుమార్ యాదవ్, వెంకన్న, ప్రభాకర్, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, బద్రీనాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



పాలకుర్తిటౌన్: సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాలకుర్తి టౌన్: ఈనెల 25వ తేదీన పాలకుర్తిలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక నియోజకవర్గ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ పాలాస సోమయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నియోజవర్గ అధ్యక్షుడు మూల ప్రభాకర్ గౌడ్, పులిగిల్ల యాకయ్య, కత్తుల సుధాకర్, గుగ్గిళ్ల ఎల్లయ్య, నక్క లింగయ్య, మూల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక..

తెలంగాణ ఉద్యమకారులు ఆకాంక్షల వేదిక మండల అధ్యక్షుడిగా సింగ మహేందర్‌రాజు, గౌరవ అధ్యక్షుడిగా సింగారాపు దీపక్, ఉపాధ్యాక్షులుగా చీటూరు రామచంద్రు, గుగ్గిళ్ల శ్రీనివాస్, దుస్సా చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా లావుడియా రవి, సభ్యులుగా గొట్టిముక్కుల సుధాకర్‌రెడ్డి, మోజు ఉంద్రచారి, కడుదుల నిరంజన్‌రెడ్డి, ఏనుగు అంజిరెడ్డి, వీరమల్ల రాజు, తమ్మడపల్లి అన్వేష్, ఎడవెల్లి దండయ్య, కొత్తకొండ వాసు, రేపాల అశోక్ ఎన్నికయ్యారు.

‘ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం అనివార్యం’

దేవరుప్పుల: తెలంగాణ సాధన కోసం పాటుపడిన ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం అనివార్యమని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక నియోజకవర్గ కన్వీనర్ మూల ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల అకాంక్షల వేదిక మండల అధ్యక్షుడు కత్తుల సుధాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన పాలకుర్తిలో తలపెట్టిన సభ కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సోమయ్య, వీరన్న, రాములు, శ్రీను, మహేష్, గేమ, బీమా పాల్గొన్నారు.

ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటా..

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ప్రవీణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

జనగామ రూరల్: బీఆర్‌ఎస్ నాయకుడు పానుగంటి ప్రవీణ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రవీణ్ మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో జరిగిన ప్రవీణ్ దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రవీణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే రూ.2 లక్షలు, పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి రూ. లక్షతో పాటు పలువురు నాయకులు అందించిన ఆర్థికసాయాన్ని డిపాజిట్ చేసి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.

ఉగ్రవాదానికి దేశంలో చోటు లేదు

జనగామ: దేశంలో ఉగ్రవాదానికి ఎప్పటికీ చోటు లేదని ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పహల్గాం పాశవిక చర్యకు ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని తీవ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ దళాలు విజయవంతంగా దాడులు చేసి మట్టుబెట్టాయన్నారు. దేశం మొత్తం సైనికుల వైపే ఉన్నారన్నారు. భారత సైన్యం తెగువ, భద్రత కోసం వారు చేస్తున్న పోరాటానికి అభినందనలు తెలిపారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

పాలకుర్తి టౌన్: నియోజకవర్గంలో అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ రాపాక శ్రీశైలం, నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండిపెల్లి యాదగిరి, తొర్రూరు మండల అధ్యక్షుడు ఈదునూరి శ్రీకాంత్, బండిపెల్లి రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి



చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలోని శ్రీమదనాపురి వేణుగోపాలస్వామి ఆలయ భూములను ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం చిల్పూరు ఆలయ ఈఓ లక్ష్మీ ప్రసన్నకు వినతి పత్రం అందజేశారు.

సంజీవకు రాజ్యాంగ ఆవశ్యకత అవార్డు

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన గాయకులు, కవి గట్టగల్ల సంజీవకు రాజ్యాంగ ఆవశ్యకత అవార్డును బుధవారం తెలంగాణ కులాల గళాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అందజేశారు. హైదరాబాద్‌లో కూకట్‌పల్లిలో చిత్తారమ్మ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో దరువు అంజన్న, డాక్టర్ ప్రవీణ్, జుట్టు సాయిలు ఉన్నారు. తనకు అవార్డు అందజేసిన తెలంగాణ కులాల గళాల ఐక్య వేదిక నాయకులకు సంజీవ కృతజ్ఞతలు తెలిపారు.

మిద్దెపాక సిద్దులుకు దళితరత్న అవార్డు



జనగామ రూరల్: పసరమడ్ల గ్రామానికి చెందిన మిద్దెపాక సిద్దులు దళిత రత్న అవార్డును అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన దళిత నాయకులను గుర్తించి ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం దళితరత్న అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా మిద్దెపాక సిద్దులను రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిద్దులు మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

- పరిశీలించిన ఆర్డీఓ డీఎస్ వెంకన్న



మీదికొండలో రెవెన్యూ సదస్సులో అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మూడోరోజు నమిలిగొండ, మీదికొండ గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించగా ఆర్డీఓ డీఎస్ వెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారన్నారు. రెవెన్యూ సదస్సులతో భూసమస్యలపై అవగాహన వస్తుందన్నారు. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 13వ తేదీ వరకు సదస్సులు ఉంటాయని, భూ సమస్యలు ఉన్నవారు సదస్సులలో పాల్గొని దరఖాస్తులను సమర్పించాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు శ్రీకాంత్, సతీష్, మాజీ సర్పంచ్‌లు నాగరబోయిన మణెమ్మయాదగిరి, నాగరబోయిన శ్రీరాములు తదితరులు ఉన్నారు.

కష్టజీవులకు అండ.. కమ్యూనిస్టు జెండా



మాట్లాడుతున్న సీహెచ్ రాజారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి

నర్మెట: కమ్యూనిస్టు జెండా నిరంతరం కష్టజీవులకు అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. గజ్జెల్లి వెంకటయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితులను సరిచేయాలంటే కేవలం ఎర్రజెండాతోనే సాధ్యమని, ప్రధాని మోదీ ప్రజలమధ్యన చిచ్చు పెడుతున్నారని అన్నారు. గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగిరిననాడే దేశం ప్రశాంతంగా ఉంటుందని, కార్యకర్తలు ఆ దిశగా పనిచేయాలని సూచించారు. అనంతరం 15 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రెండో సారి పాతూరి ప్రశాంత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా సహాయ కార్యదర్శిగా మాలోత్ సీతారాం ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పాతూరి సుగుణమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న కనకారెడ్డి

బచ్చన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పర్వతం నర్సింహులు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ నిత్యావసరాల ధరలు పెంచి పేద ప్రజలపై మోయలేని భారం వేస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారులకు కాంగ్రెస్ కమిటీ సభ్యులు అన్యాయం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, రాజు, ఎల్లయ్య, బలరాములు, ఎల్లయ్య, ఈదమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారిలో పలు ప్రాంతాల్లో తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని గొల్లపల్లి, చింతబాయితండా, కామారెడ్డిగూడెం ఎంఎన్‌ఆర్ గార్డెన్ ఏరియాల్లో ప్రమాదపు స్థలాలను గుర్తించి పోలీసు శాఖ, చండీ పరమేశ్వరీ పీఠం వ్యవస్థాపకులు సిద్ధాంతి అవసరాల ప్రసాద్‌శర్మ సహకారంతో సమకూర్చిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. రహదారుల్లో వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ పరిమితి మించకుండా వాహనాలు నడుపాలన్నారు. కానిస్టేబుల్ మసూద్ పాషా, హోంగార్డు నరేష్ ఉన్నారు.

వైభవంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



జనగామ: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



జఫర్‌గఢ్‌లో..



నర్మెట: వాసవిమాత జయంతి వేడుకల్లో భక్తులు



రఘునాథపల్లి: వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు



దేవరుప్పలలో..



పాలకుర్తి టౌన్: మంగళహారతులతో మహిళలు

జనగామ/నర్మెట/జఫర్‌గఢ్/రఘునాథపల్లి/దేవరుప్పుల/పాలకుర్తిటౌన్: వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ఆర్యవైశ్యులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కళశాభిషేకం, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పండ్లు, పూలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీల చైర్మన్లు, పూజారులు, సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ జి.వేణు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ కరాటే క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీఐ జి.వేణు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ షావ్‌లీన్‌కుంగ్‌పూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కరాటే సమ్మర్ క్యాంపు శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఇటీవల పదో తరగతి వార్షిక ఫలితాల్లో 570 మార్కులతో ప్రతిభ చాటిన ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థి కడమంచి అక్షరను కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించి ప్రోత్సాహకంగా రూ.5వేలు అందించారు. కరాటే మాస్టర్లు పెసరు సారయ్య, వంగ శ్రీను, గోనెల ఉపేందర్, పాదల రాజేష్, పొన్న కిషన్, శివ, జావీద్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: వేద కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కరాటే శిక్షణ ఇస్తున్నట్లు మాస్టర్ విక్రమ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రతీ సోమ, బుధ, శుక్ర వారాల్లో ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు కరాటే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు శిక్షణ తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం



తరిగొప్పుల: మండలకేంద్రం శివారు కనీలకుంటకు చెందిన బాషబోయిన రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం బీఆర్‌ఎస్ పార్టీ మండల కమిటీ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి మండల కమిటీ తరఫున రూ.20 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో పింగిళి జగన్మోహన్‌రెడ్డి, చిలువేరు లింగం, ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుదాస్, జుంలాల్‌నాయక్, అంకం రాజారాం, మహిపాల్, పోషయ్య, యాదగిరి, సురేందర్, కొమురయ్య, సంపత్, మొగిలి, సత్తయ్య, రవి, కనుకరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.